క్లుప్తంగా

నిత్యావసర సరుకుల పంపిణీ



కామారెడ్డి రూరల్: ప్రముఖ స్వచ్ఛంద సేవా సంస్థ సెవెన్ హార్స్ ఆర్గనైజేషన్(ఎన్‌జీవో) ఆధ్వర్యంలో ఫరీద్‌పేట్ గ్రామంలోని ఇంటర్నేషనల్ ప్రేయర్ ఫెలోషిప్ చర్చిలో క్రిస్మస్ వేడుకలు ఘనంగా జరిపారు. ప్రత్యేక ప్రార్థనలు చేసి సంస్థ తరఫున నిరుపేద క్రిస్టియన్ కుటుంబాలకు సరుకులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో పాస్టర్ రత్నం, ఎన్జీవో ఫౌండర్ జీవన్ నాయక్, ప్రతినిధులు లత, అశ్విని, రాజు, పవన్ కల్యాణ్, రాహుల్, బ్రదర్ లక్ష్మణ్, సంఘ ప్రజలు పాల్గొన్నారు.

అమ్మవారికి బంగారు ముక్కుపుడక అందజేత



దోమకొండ: మండల కేంద్రంలోని చాముండేశ్వరి ఆలయంలో ఆదివారం చాముండేశ్వరి అమ్మవారికి బంగారు ముక్కుపుడక అందజేశారు. గ్రామానికి చెందిన సాయబ్‌గారి స్రవంతి–విజయ్ దంపతులు అమ్మవారికి రెండు గ్రాముల ముక్కు పుడకను అందించారు. క్యాక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ పాలకుర్తి శేఖర్, ధర్మకర్తలు రాజిరెడ్డి, నీవన్, రాజయ్య, ఎంపీటీసీ కదారి రమేష్, ఆలయ పూజారి శరత్‌చంద్రశర్మ, తదితరులు ఉన్నారు.

బోరుబావి తవ్వకం పనులు ప్రారంభం



నాగిరెడ్డిపేట(ఎల్లారెడ్డి): ఆత్మకూరులో బోరుబావి తవ్వకం పనులను ఆదివారం స్థానిక జెడ్పీటీసీ సభ్యుడు మనోహర్‌రెడ్డి ప్రారంభించారు. రూ.లక్షా 20 వేల జిల్లా పరిషత్ నిధులతో గ్రామంలో బోరుబావి తవ్వకం పనులు చేపట్టినట్లు ఆయన చెప్పారు. బోరుబావి తవ్వించిన తర్వాత మోటారును బిగింపజేస్తామని ఆయన తెలిపారు. సర్పంచ్ బాల్‌రెడ్డి, ఎంపీటీసీ సభ్యుడు శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

నాలుగు రికవరీ ఫోన్ల అందజేత



తాడ్వాయి(ఎల్లారెడ్డి): పోగొట్టుకున్న నాలుగు మొబైల్ ఫోన్‌లను సీఈఐఆర్ అప్లికేషన్ ద్వారా వెతికి ఆ ఫోన్‌ల యజమానులకు అందజేసినట్లే ఎస్సై ఆంజనేయులు తెలిపారు. కొన్ని రోజుల క్రితం మొబైల్‌లను పోగొట్టుకున్న నలుగురు, పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేశారన్నారు. సీఈఐఆర్ ద్వారా మొబైల్‌లను వెతకగా ఇతరుల దగ్గర మొబైల్‌లు లభించాయన్నారు.

మృతుని కుటుంబానికి అండగా మిత్రులు



లింగంపేట(ఎల్లారెడ్డి): బోనాల్ గ్రామానికి చెందిన చిన్ననాటి మిత్రుడు వడ్ల లక్ష్మీకాంతయ్య(10వ తరగతి 2002–2003 బ్యాచ్) గుండెపోటుతో మూడు రోజుల క్రితం మృతి చెందడంతో బాధిత కుటుంబ సభ్యులకు మిత్రులు ఆదివారం ఆర్థిక సహాయం అందజేశారు. లక్ష్మీకాంతయ్య కామారెడ్డిలో ఆటో నడుపుకుంటూ జీవనం కొనసాగించేవాడు. ఆయన మృతితో కుటుంబ సభ్యులు రోడ్డున పడ్డారు. మృతుడికి భార్య, కూతురు ఉన్నారు. నిరుపేద కుటుంబం కావడంతో ప్రభుత్వం ఆదుకోవాలని మిత్రులు కోరుతున్నారు. మిత్రులు మన్నె సాయిలు, బాలమల్లు, శేఖర్, రాజారాం బాలరాజు, బాషు, రియాజ్, దత్తు, తదితరులు పాల్గొన్నారు.

గోశాలకు కల్లి పిండి అందజేత

పిట్లం(జుక్కల్): మండల కేంద్రానికి చెందిన ప్రముఖ వ్యాపారవేత్త మార్గాల వేణు గోపాల్ దంపతులు వారి 19వ వివాహ వార్షికోత్సవం సందర్భంగా శనివారం శ్రీ లక్ష్మీ నారాయణ గోశాలకు గోవుల మేత కోసం 50 కిలోల కల్లిపిండిని అందజేశారు. అంతకుముందు వారు పలు ఆలయాలలో అభిషేకాలు, ప్రత్యేక పూజలు నిర్వహించారు. 19 ఏళ్లుగా, వీరి కుటుంబంలో ఏ విశేషం ఉన్నా దానధర్మాలు, అన్నదానాలు చేస్తూ అందరికీ ఆదర్శంగా నిలుస్తున్నారు. ఇంతే కాకుండా వేణుగోపాల్ దంపతులు లయన్స్ క్లబ్ సభ్యులుగా ఉంటూ అనేక సేవా కార్యక్రమాలు నిర్వహిస్తుంటారు.

పాఠాలు నేర్చుకోని యంత్రాంగం

- ఇటీవల కొత్తాబాది పాఠశాల వెనక కాలువలో పడి చిన్నారి మృతి
- వారం గడిచినా నష్ట నివారణ చర్యలు చేపట్టని అధికార యంత్రాంగం



కొత్తాబాది ప్రైమరీ పాఠశాల వెనుక తెరిచి ఉన్న మ్యాన్‌హోల్



కూలిన ప్రహరీ స్థానంలో ఫెన్సింగ్ కూడా ఏర్పాటు చేయకుండా వదిలేసిన ప్రదేశం

బాన్సువాడ రూరల్: మండలంలోని కొత్తాబాది ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో ఈ నెల 19న ఫర్హాన్ అనే ఒకటో తరగతి విద్యార్థి మధ్యాహ్న భోజన సమయంలో పాఠశాల వెనుక ఉన్న నిజాంసాగర్ ఉపకాలువలో పడి మృతి చెందిన విషయం విదితమే. గతంలో కూలిన ప్రహరీ అసంపూర్తిగా ఉండటంతో విద్యార్థి ప్రమాదానికి గురయ్యాడు. విద్యార్థి మృతి చెంది వారంరోజులు కావస్తున్నా అటు అధికారులు కానీ, ఇటు గ్రామ పంచాయతీ పాలకులు కాని మరోసారి ప్రమాదం జరగకుండా ఎలాంటి నివారణ చర్యలు చేపట్టలేదు. కూలిన ప్రహరీ స్థానంలో నేటికీ గోడ నిర్మించడం అటుంచి కనీసం ఫెన్సింగ్ కూడా ఏర్పాటు చేయలేదు. అలాగే పాఠశాలలో టాయిలెట్స్ పక్కన గతంలో నిర్మించిన సెప్టిక్ ట్యాంక్ మ్యాన్‌హోల్ కూడా నేటికి అలాగే తెరిచి ఉంది. నిండు ప్రాణం గాలిలో కలిసినా అధికారులు పాఠాలు నేర్చుకోలేకపోవడం పట్ల గ్రామస్తులు విస్మయం వ్యక్తం చేస్తున్నారు. ఘటన జరిగిన రోజు వచ్చిన ఎంఈవో నాగేశ్వరావు, ఎంపీడీవో సత్యనారాయణరెడ్డి నేటికి అటు వైపు కన్నెత్తి చూడలేదని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. పాఠశాలకు పిల్లలను పంపించాలంటే భయం వేస్తుందని తల్లిదండ్రులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. మరోసారి దుర్ఘటనలు పునరావృతం కాకుండా అధికారులు తగు చర్యలు తీసుకోవాలని విద్యార్థుల తల్లిదండ్రులు ముక్తకంఠంతో కోరుతున్నారు. లేదంటే విద్యార్థులతో కలిసి కలెక్టర్ కార్యాలయం వద్ద ఆందోళన చేయడానికి తల్లిదండ్రులు, యువకులు, గ్రామస్తులు సన్నద్ధం అవుతామని హెచ్చరిస్తున్నారు.

అఖండ్ భారత్ రక్తసేవా సమ్మాన్ పురస్కారానికి ఎంపిక



డాక్టర్ బాలు

కామారెడ్డి అర్బన్: రెడ్ క్రాస్ సొసైటీ కామారెడ్డి జిల్లా సమన్వయకర్త, ఐవీఎఫ్ సేవాదళ్ రాష్ట్ర చైర్మన్ డాక్టర్ బాలు రక్తదానంలో 16 సంవత్సరాలుగా అందిస్తున్న సేవలకు గాను 'అఖండ్ భారత్ రక్తసేవా సమ్మాన్' పురస్కారానికి ఎంపికయ్యారు. మధ్యప్రదేశ్ ఖాండ్వాకు చెందిన జైమహారాణా రక్తదాన్ సమూమయ్ భారత్ సంస్థ వ్యవస్థాపక అధ్యక్షుడు రక్తమిత్ర శైలు మండోలి ఈ మేరకు బాలుకు వర్తమానం పంపారు.

బాలు ఇప్పటికి 200లకు పైగా రక్తదాన శిబిరాలు నిర్వహించడంతో పాటు తలసేమియా వ్యాధితో బాధపడే చిన్నారుల కోసం ప్రతినెలా మెగా శిబిరాలు నిర్వహిస్తూ రక్తసేకరణ చేస్తున్నారు. ఇతర రాష్ట్రాల్లోనూ జాతీయ స్థాయిలో తనకు రక్తదానంలో గుర్తింపు రావడం పట్ల బాలు సంతోషం వ్యక్తం చేశారు.

సమస్యలపై పోరాటం చేసేది సీపీఎం మాత్రమే



సభ్యత్వం అందజేస్తున్న జిల్లాకార్యదర్శి వెంకట్ గౌడ్

లింగంపేట(ఎల్లారెడ్డి): ప్రజల సమస్యలు పరిష్కరించడానికి సీఎంఎం నిరంతం పోరాడుతుందని ఆ పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి వెంకట్ అన్నారు. ఆదివారం ఆయన లింగంపేటలో సీపీఎం సభ్యత్వం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. సీపీఎం ఎన్నో పోరాటాలు చేయడం వల్లనే ప్రజాస్వామ్యం బతికి ఉందన్నారు. ప్రస్తుతం కార్పొరేట్ రాజకీయాలతో ప్రజాస్వామ్యం కూనీ అవుతోందన్నారు. ప్రజాస్వామ్యవాదులు పోరాటాలకు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. ప్రజా సమస్యలు ఎక్కడ ఉంటే అక్కడ ఎర్రజెండా ఉంటుందన్నారు. పలువురికి సభ్యత్వం అందజేసినట్లు తెలిపారు. జిల్లా కోర్ కమిటీ సభ్యులు మోతీరాం, భాస్కర్, సావిత్రి, మహేశ్, తదితరులు పాల్గొన్నారు.

కనీస వేతనం అమలు చేయాలి



మాట్లాడుతున్న వీఎస్ బోసు

కామారెడ్డి టౌన్: కార్మికులకు కనీస వేతనం రూ.21 వేలు అమలు చేయాలని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను ఏఐటీయూసీ జాతీయ కౌన్సిల్ సభ్యుడు వీఎస్ బోసు డిమాండ్ చేశారు. ఆదివారం జిల్లా కేంద్రంలోని కార్యాలయంలో ఆయన మాట్లాడారు. ప్రభుత్వ ఆస్పత్రుల్లో పని చేస్తున్న కార్మికులకు జీవో–60 ప్రకారం వేతనాలు, పీఎఫ్, ఈఎస్ఐ సౌకర్యం కల్పించాలని డిమాండ్ చేశారు. నాలుగు నెలలుగా కార్మికులకు జీతాలు ఇవ్వకపోవడం దారుణమన్నారు. తక్షణమే ఆ కాంట్రాక్టర్‌పై చర్యలు తీసుకోవాలన్నారు. శ్రమ దోపిడికి గురి చేస్తున్న కాంట్రాక్టర్‌పై క్రిమినల్ కేసు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. ఏఐటీయూసీ సీనియర్ నాయకుడు వీఎల్ నర్సింహారెడ్డి, మెడికల్ ఎంప్లాయిస్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు ఎల్.దశరత్, జిల్లా అధ్యక్షుడు బాల్‌రాజు, కార్యదర్శి రాజశేఖర్ తదితరులున్నారు.

క్రిస్మస్ వేడుకలకు చర్చీల ముస్తాబు

జిల్లాలో క్రిస్మస్ వేడుకలకు చర్చిలు సిద్ధమయ్యాయి. భక్తులు ప్రార్థనలు చేసేందుకు వీలుగా అన్నిరకాల ఏర్పాట్లు పూర్తి చేశారు. నేడు క్రిస్మస్ పర్వదినం కావడంతో కొత్తగా రంగులు వేసి మిరుమిట్లు గొలిపేలా లైట్లతో చర్చిలను అలంకరించారు. వేడుకల అనంతరం పలు చర్చిల వద్ద అన్నదానం చేసేలా ఏర్పాట్లు చేస్తున్నారు. – సాక్షి నెట్‌వర్క్



తాడ్వాయిలో ముస్తాబైన పెద్ద చర్చి



నాగిరెడ్డిపేట: రాఘవపల్లి గేట్ వద్ద



కామారెడ్డిరూరల్: గర్గుల్‌లో..



ఎల్లారెడ్డిలో..

ఎమ్మెల్యే మదన్‌మోహన్‌రావు శుభాకాంక్షలు

ఎల్లారెడ్డిరూరల్(ఎల్లారెడ్డి): ఎల్లారెడ్డి నియోజకవర్గంలోని క్రైస్తవ సోదరులకు ఎమ్మెల్యే మదన్ మోహన్‌రావు క్రిస్మస్ శుభాకాంక్షలు తెలుపుతూ ఆదివారం ఒక ప్రకటన విడుదల చేశారు. క్రైస్తవ సోదరులు ఆనందోత్సాహాలతో పండగను జరుపుకోవాలని కోరారు. క్రిస్మస్ పండగ అందరి జీవితాలలో సంతోషం కలిగించాలని ఆకాంక్షించారు.

నరసింహుడి ఆలయంలో కుంకుమ పూజలు



పూజలు నిర్వహిస్తున్న భక్తులు

మాచారెడ్డి: చుక్కాపూర్ లక్ష్మీనరసింహ స్వామి ఆలయంలో ఆదివారం భక్తులు కుంకుమ పూజలు నిర్వహించారు. గండ దీపాలు, మొక్కుబడులు, ముడుపులు, ఒడి బియ్యం కార్యక్రమాలు భక్తి శ్రద్ధలతో చేశారు. ఆలయ అభివృద్ధి కమిటీ చైర్మన్ కమలాకర్ రెడ్డి, ఈవో శ్రీధర్ రావు, సిబ్బంది సంతోష్ కుమార్, లక్ష్మణ్ ఉన్నారు.

కొచ్చెరి మైసమ్మ ఆలయంలో భక్తుల సందడి

నస్రుల్లాబాద్(బాన్సువాడ): మైలారంలో ఆదివారం భక్తుల సందడి నెలకొంది. ఈ సందర్భంగా ఆలయ కమిటీ సభ్యులు భక్తులకు సౌకర్యాలు కల్పించారు. భక్తులు అమ్మవారికి కుంకుమ అర్చనలు, అభిషేకాలు నిర్వహించి, కొబ్బరి కాయలు కొట్టి నైవేద్యాలను సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు.

రోడ్డు భద్రతా నియమాలు పాటించాలి



సదాశివనగర్(ఎల్లారెడ్డి): వాహనదారులు ప్రతి ఒక్కరు తప్పనిసరిగా రోడ్డు భద్రతా నియమాలు పాటించాలని హెడ్ కానిస్టేబుల్ దేవరాజ్ సూచించారు. ఆదివారం మండల కేంద్రంలోని బ్రిడ్జి వద్ద వాహన చోదకులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ద్విచక్ర వాహనం నడిపిస్తున్న ప్రతి వ్యక్తి హెల్మెట్ ధరించాలన్నారు. రోడ్డుపై రాంగ్ రూట్‌లో ఎట్టి పరిస్థితుల్లో వెళ్ల వద్దన్నారు. నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరిస్తే చలాన్‌లను విధిస్తామన్నారు.

భక్తి శ్రద్ధలతో గీతా జయంతి



కామారెడ్డి అర్బన్: అంతర్జాతీయ కృష్ణచైతన్య సంఘం(ఇస్కాన్) కామారెడ్డి కేంద్రంలో ఆదివారం గీతా జయంతి ఉత్సవం భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. భగవద్గీత సంపూర్ణ అధ్యయనం చేశారు. దాతల సహకారంతో భగవద్గీత పుస్తకాలను వితరణ చేశారు. అనంతరం భక్తులు భజనలు చేస్తూ నృత్యాలు చేశారు. ఇస్కాన్ కామారెడ్డి ప్రతినిధులు శ్రీమాన్ వెంకటదాస్, యుగల్ కిశోర్, పరశురామ్, అశోక్, అరవింద్, శ్రీనివాస్ పాల్గొన్నారు.

అంజనాద్రికి అయోధ్య కలశం



నిజాంసాగర్(జుక్కల్): మాగి గ్రామ ఆంజనేయ స్వామి ఆలయానికి ఆదివారం రాత్రి అయోధ్య రామ మందిర అంక్షితల కలశం చేరుకున్నాయి. అంజనేయస్వామి ఆలయం వద్ద ఉన్న అయ్యప్ప స్వాములు అంక్షితలకు ప్రత్యేక పూజలు చేశారు. జనవరి 22న అయోధ్యలో శ్రీరామ మందిరం ప్రారంభోత్సవం సందర్భంగా రాముడి పాదాల వద్ద ఉన్న అక్షింతలు ఊరూరా పంపిణీ చేయనున్నారు. ఈ మేరకు వచ్చిన అక్షింతలను అంజనేయస్వామి ఆలయంలో భద్రపర్చారు.

జీవిత బీమా పథకాలపై ప్రచారం

కామారెడ్డి అర్బన్: భారతీయ జీవిత బీమా పథకాలపై ఆదివారం వివిధ గ్రామాల్లో చైతన్యపరిచినట్లు ఎల్ఐసీ కామారెడ్డి శాఖ ఇన్‌చార్జి మేనేజర్ వీరకోటి రామచంద్రం తెలిపారు. గుడిమెట్, భూంపల్లి, లింగంపల్లి, ఉత్తనూర్, పద్మాజీవాడి, ధర్మరావుపేట, సదాశివనగర్, మర్కల్, కుప్రియాల్, అడ్లూర్ ఎల్లారెడ్డి, అడ్లూర్ గ్రామాల్లో జీవిత బీమా పథకాలపై సంచార వాహనంతో ప్రచారం నిర్వహించినట్లు ఇన్‌చార్జి మేనేజర్ రామచంద్రం వివరించారు.

ఘనంగా మల్లన్న కల్యాణం



నిజాంసాగర్(జుక్కల్): మండల కేంద్రంలో మల్లన్న ఆలయ వార్షికోత్సవం, కల్యాణ తంతు కార్యక్రమాన్ని ఆదివారం వైభవంగా నిర్వహించారు. కుర్మసంఘం ఆధ్వర్యంలో మల్లన్న వార్షికోత్సవాలను వగ్గు బృందం సభ్యులు హోమ గుండాలు, పోతరాజుల విన్యాసాలతో ఆకట్టుకున్నారు. ఆనంతరం మల్లన్న, కామరతి వివాహం వైభవంగా జరిపారు. భక్తులకు కుర్మ సంఘం ఆధ్వర్యంలో అన్నదానం నిర్వహించారు. కుర్మ సంఘం నాయకులు కుర్మ దస్తయ్య, సాయిలు, బీరప్ప, దశరథ్, బాల్‌రాజ్, కృష్ణమూర్తి, సంగమేశ్వర్ తదితరులున్నారు.

సొసైటీలో అవిశ్వాసం నెగ్గేనా?

రాజంపేట: రాజంపేట సొసైటీ చైర్మన్, వైస్ చైర్మన్లపై డైరెక్టర్లు పెట్టిన అవిశ్వాసం నెగ్గేనా అని మండల కేంద్రంలో జోరుగా చర్చలు నడుస్తోంది. చైర్మన్, వైస్ చైర్మన్‌లపై 9 మంది డైరెక్టర్లు ఈ నెల 8న అవిశ్వాసం ప్రకటించారు. దీంతో స్పందించిన జిల్లా సహకార సంఘం 13న పాలకవర్గానికి నోటీసులు జారీ చేసింది. జనవరి 2న జిల్లా సహకార సంఘం అవిశ్వాసంపై జరిగే సమావేశానికి చైర్మన్, వైస్ చైర్మన్‌లతో పాటు డైరెక్టర్లు సైతం హాజరు కావాలని నోటీసులో పేర్కొంది. దీంతో పాలకవర్గంలో అలజడి మొదలైంది. సభ్యులు ఎవరికి మద్దతు పలుకుతారో అనేది చర్చనీయాంశంగా మారింది. గతంలో ఉన్న చైర్మన్, వైస్ చైర్మన్‌లు బీఆర్ఎస్ పార్టీకి చెందిన వారు కాగా ఇటీవల అసెంబ్లీ ఎన్నికల్లో రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడగా కామారెడ్డిలో బీజేపీ అభ్యర్థి గెలిచారు. దీంతో ఇతర పార్టీల అభ్యర్థులు చైర్మన్, వైస్ చైర్మన్ పదవి కోసం సన్నాహాలు చేస్తున్నట్లు సమాచారం అందింది. అవిశ్వాసంలో నెగ్గాలంటే 9 మంది కోరం తప్పనిసరి. మొత్తం 13 మంది అభ్యర్థులు ఉండగా ఓ డైరెక్టర్ కొన్ని నెలల క్రితం అనారోగ్యంతో చనిపోయారు. అవిశ్వాస విషయం తేలాలంటే జనవరి 2 వరకు వేచి చూడాల్సిందే.

భక్తిశ్రద్ధలతో అయ్యప్ప మహాపడి పూజ



బీబీపేటలో పూజ నిర్వహిస్తున్న అయ్యప్ప స్వాములు



ఎల్లారెడ్డిలో..

బీబీపేట: మండల కేంద్రంలో అయ్యప్ప స్వామి మహాపడి పూజా కార్యక్రమాన్ని ఆదివారం అయ్యప్ప మాలాధారులు ఘనంగా నిర్వహించారు. అన్నదానం చేశారు. అయ్యప్ప మాలధారులు విఠల్, నాగరాజు, పర్శరాంలు గౌడ్, తదితరులు పాల్గొన్నారు.

ఎల్లారెడ్డిలో..

ఎల్లారెడ్డిరూరల్(ఎల్లారెడ్డి): పట్టణంలో సంగమేశ్వర్‌రెడ్డి స్వామి ఇంటిలో అయ్యప్ప పడిపూజ కార్యక్రమాన్ని ఆదివారం ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో గురుస్వాములు చంద్రం, నాగేష్, రాజేందర్‌నాథ్, ప్యాలాల రాములు, శ్రీనివాస్‌గౌడ్ తదితరులున్నారు.

నేడు అయ్యప్ప మహాపడిపూజ

నాగిరెడ్డిపేట(ఎల్లారెడ్డి): గోపాల్‌పేటలో సోమవారం అయ్యప్ప మహాపడిపూజ నిర్వహించనున్నట్లు స్థానిక అయ్యప్ప సేవా సమితి సభ్యులు తెలిపారు. ఆర్యవైశ్య సంఘం కల్యాణ మండపంలో ఉదయం 9 గంటలకు మహాపడిపూజ ప్రారంభమవుతుందని వారు చెప్పారు.

అయ్యప్ప విగ్రహం ఊరేగింపు



భిక్కనూరు: మండల కేంద్రంలో అయ్యప్ప విగ్రహ ఊరేగింపు కార్యక్రమాన్ని ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వాహనంపై అయ్యప్ప, సుబ్రహ్మణ్య స్వామి, వినాయక విగ్రహాలను ప్రతిష్ఠించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం మండల కేంద్రంలో పెద్ద ఎత్తున ఊరేగించారు. మహిళలు మంగళహారతులతో స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఆయ్యప్ప స్వాములు భిక్షాటన కార్యక్రమాన్ని నిర్వహించారు. ప్రజలు అందించిన విరాళాలను అయ్యప్ప ఆలయ అభివృద్ధికి వినియోగిస్తామని వారు తెలిపారు. కార్యక్రమంలో అయ్యప్ప గురుస్వాములు కేవీ సుబ్బారావు, లింగాల గంగాగౌడ్, రవీందర్‌రెడ్డి, రామక్రిష్ణ, స్వాములు శ్రీనివాస్, చంద్రమోహన్, హరినాథ్, శ్రీనాథ్, తదితరులు పాల్గొన్నారు.

లోపించిన పారిశుద్ధ్యం



పిట్లంలోని ఓ కాలనీలో నిల్వ ఉన్న చెత్తాచెదారం

పిట్లం(జుక్కల్): పిట్లం జీపీ పరిధిలోని పలు కాలనీలలో, రహదారుల పక్కన చెత్తాచెదారం పేరుకుపోయింది. దుర్వాసన వెదజల్లుతోంది. దీంతో కాలనీవాసులు అనారోగ్యానికి గురవుతున్నారు. అదే విధంగా ప్రధాన రహదారుల పక్కనే వ్యర్థ పదార్థాలు పార వేయడంతో దుర్వాసన వెదజల్లుతోంది. దాని వల్ల ప్రయాణికులు ఇబ్బందులకు గురవుతున్నారు. పంచాయతీ సిబ్బంది గ్రామంలో చెత్తాచెదారం సేకరించి కంపోస్ట్ షెడ్‌కు తరలించకుండా ఎక్కడ పడితే అక్కడ పార వేస్తున్నారు. పంచాయతీ పరిధిలో చెత్తను సేకరించి కంపోస్ట్ షెడ్‌కు తరలించేలా సంబంధిత అధికారులు చర్యలు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.



మహమ్మద్‌నగర్‌లో..

కమ్మేసిన మంచు దుప్పటి

నిజాంసాగర్(జుక్కల్): నిజాంసాగర్, మహమ్మద్‌నగర్ మండల కేంద్రాలతో పాటు ఆయా గ్రామాల్లో ఆదివారం ఉదయం మంచు దుప్పటిలా కమ్మేసింది. ఉదయం 9 గంటలకు కూడా మంచు పోలేదు. దాంతో వాహనదారులు ఇబ్బందులు పడ్డారు.

సమాచారం..

29న సరస్వతి ఆలయ సప్తమ వార్షికోత్సవం

కామారెడ్డి రూరల్: పట్టణ పరిధిలోని ఇల్చిపూర్ శ్రీ సరస్వతీ మాత ఆలయ సప్తమ వార్షికోత్సవాలకు ఆలయాన్ని ముస్తాబు చేసినట్లు ఆలయ నిర్మాణ కర్త పార్శి విఠల్ పటేల్, ప్రతినిధి కోలాల సిద్దాగౌడ్, అర్చకులు దత్తురావు, విజయపాండే, ప్రమోద్ మిశ్ర తెలిపారు. ఈ నెల 29న ఉదయం 5 గంటల నుంచే ఉత్సవాలు ప్రారంభమౌతాయన్నారు. సిద్దిపేట జిల్లా అనంతసాగర్‌కు చెందిన శ్రీ సరస్వతీ మహాక్షేత్ర నిర్మాత కీ.శే అష్టకాల నరసింహ రామశర్మ ఆశీస్సులతో ఉత్సవాలు జరుగుతాయన్నారు.

27న మహాపడి పూజ

బాన్సువాడ: ఈ నెల 27న అయ్యప్ప మహాపడిపూజ నిర్వహించనున్నట్లు అయ్యప్ప దీక్షా స్వాములు తెలిపారు. ఆదివారం వారు మహాపడిపూజ షెడ్యూల్‌ను వివరించారు. అఖండ దీపారాధన, పుణ్యాహవచనం, గణపతి హోమంతో పడిపూజ ప్రారంభం అవుతుందన్నారు. ఆధ్యాత్మిక వేత్త సత్యవాణి అమ్మ(హైద్రాబాద్), చార్ధామ్ కేదార్నత్ ఆలయం ప్రధాన అర్చకులు శివలింగ మహదేవస్వామీల ప్రవచనాలు ఉంటాయన్నారు.

26న చిన్నమల్లారెడ్డిలో..

కామారెడ్డి అర్బన్: కామారెడ్డి మండలం చిన్నమల్లారెడ్డి అయ్యప్పసేవా సంఘం ఆధ్వర్యంలో ఈనెల 26న మంగళవారం 9వ పడిపూజ ఉత్సవం, ఆరట్టు ఉత్సవాలు నిర్వహిస్తున్నట్టు అయ్యప్పసేవా సమితి తెలిపింది. చిన్నమల్లారెడ్డి వేంకటేశ్వరస్వామి ఆలయం నుంచి మంగళవారం సాయంత్రం 4 గంటలకు అయ్యప్పస్వామి ఊరేగింపు, 6 గంటలకు ఆరట్టు(చక్రస్నానం), పడిపూజ, అల్పాహార కార్యక్రమాలుంటాయని, భక్తులు హాజరై విజయవంతం చేయాలని సమితి విజ్ఞప్తి చేసింది.